


ఆదిలాబాద్, నిర్మల్ నూతన డీసీసీ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

డీసీసీ నూతన అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత

ఉట్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలోని గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో పార్టీ ఏఐసీసీ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ నియామక పత్రం అందుకున్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బొజ్జు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఏఐసీసీ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ల చేతుల మీదుగా ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా డాక్టర్ నరేష్‌జాదవ్ నియామక పత్రం అందుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నరేష్ పేర్కొన్నారు.



పంట పొలాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు


చలి పంజా

- భీంపూర్ మండలం అర్లి(టి)లో 10.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- మారుమూల పల్లెల్లో మున్ముందు చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం (7వ పేజీలో..)

- జిల్లాలో నిధుల్లేక ముందుకు సాగని రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు
- విమానాశ్రయం మంజూరు.. భూసేకరణనే పెద్ద సమస్య
- రేపు జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక
- జిల్లాలో రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీఎం పర్యటనపై..
ఆశలు





ఆదిలాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనపై జిల్లా వాసులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నా.. ఎన్నో ఏళ్లుగా పలు అభివృద్ధి పనులు ఇంకా అసంపూర్ణంగానే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో ఏళ్లుగా రైల్వే అండర్‌బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడం మూలంగా పనుల్లో పురోగతి కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోపక్క జిల్లా కేంద్రంలో విమానాశ్రయం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ భూసేకరణ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనే ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. కోర్టా-చనకా వ్యవసాయ కళాశాల నిర్మాణ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈనెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకేంద్రానికి రానున్నారు. ఈ తరుణంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడమే కాకుండా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

నిధులే ప్రధాన సమస్య

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాంసి బస్టాండ్, స్పిన్నింగ్ మిల్ వద్ద అండర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. కానీ నిధుల కొరతతో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు అడుగడుగున ఆటంకాలే ఎదురవుతున్నాయి. అలాగే భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. బ్రిడ్జి నిర్మాణానికి సర్వే నిర్వహించిన పరిహారం చెల్లించక పోవడంతో పనులు కొనసాగడం లేదు. అలాగే ఆర్అండ్‌బి, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం కనిపించం లేదు. ఇప్పటి వరకు రెండుసార్లు సర్వే నిర్వహించిన స్పష్టత రావడం లేదని తెలుస్తుంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తే పనులు మరింత వేగవంతంగా సాగు అవకాశం కనిపిస్తుంది.

భూ సేకరణపై అనుమానాలు

జిల్లాకేంద్రంలో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ అడుగు ముందుకు వేసినా.. భూసేకరణ సమస్యనే ప్రధానంగా కనిపిస్తోంది. ఇటీవల మరో 700 ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. అయినా ఇప్పటి వరకు పనులను ప్రారంభించడం లేదు. విమానాశ్రయ చుట్టు ఉన్న రైతులు స్థానికులు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే బాధిత రైతులతో ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూములను ఇవ్వమంటూ డిమాండ్ చేస్తున్నారు. బాధిత రైతుల పోరాట సమితిని ఏర్పాటు చేసి స్థానికంగా జిల్లా అధికారులకు వినతిపత్రాలను అందజేశా రు. ఏకాభిప్రాయం కుదరకుంటే స్థానికులతో తీవ్ర వ్యతిరేక వచ్చే అవకావం ఉంది. అందరితో సమన్వయం చేసి విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ చేయడం అధికారులకు పెద్ద సవాల్‌గానే మారింది.

సీఎం పర్యటన ఇలా..

జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి (తరువాయి 6వ పేజీలో...)

దేశంలోనే నీతి అయోగ్‌లో నాల్గవ స్థానం: కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నార్నూర్ మండలం దేశ వ్యాప్తంగా ఉన్న 500 బ్లాక్‌లలో 4వ స్థానం, అలాగే దక్షిణ భారతంలోని జోనల్-3లో 1వ ర్యాంక్ సాధించిందని కలెక్టర్ రాజర్షి షా మంగళవారం వెల్లడించారు. ఈ అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా నార్నూర్ మండలానికి రూ.1.5 కోట్లు పురస్కారం లభించిందని తెలిపారు. ఇటువంటి జాతీయ స్థాయి గుర్తింపు మరోసారి రావడం నార్నూర్ మండలాన్ని దేశంలోని అత్యుత్తమ ప్రదర్శన చేసే మండలాల్లో ఒకటిగా నిలబెట్టడమే కాక, ఇది మొత్తం జిల్లా ప్రజలకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. తాజాగా వచ్చిన డెల్టా ర్యాంకింగ్స్‌తో పాటు, నార్నూర్ ఇప్పటి వరకు వివిధ పురస్కారాలు, ప్రోత్సాహకాలను కలిపి మొత్తం రూ.2.78 కోట్లు పొందిందని తెలిపారు. వీటిలో ప్రధానమంత్రి అవార్డు, దేశవ్యాప్తంగా టాప్-5 ప్రదర్శనలో స్థానం, గవర్నర్ అవార్డు, స్టేట్స్ యూజ్-శేస్ చాలెంజ్‌లో రకూ. 8 లక్షలు, ఎడ్యుకేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్, అదేవిధంగా నీతి అయోగ్ నుంచి 7 ప్రశంస పురస్కారాలు ఉన్నాయన్నారు. ఈ విజయాలు నార్నూర్ మండలంలో నిరంతర అభివృద్ధి, శ్రేష్ఠ పాలనతో పాటు ప్రజా కేంద్రీకృత కార్యక్రమాలను ప్రతిబింభంగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 3.43 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

బోథ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 34 జిన్నింగు మిల్లులలో ఇప్పటి వరకు 3 లక్షల 43వేల పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ పేర్కొన్నారు. మంగళవారం బోథ్, సోనాల జిన్నింగులలో పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వేల క్వింటాళ్ల ప్రైవేట్ వ్యాపారులు పత్తిని కొనుగోలు చేశారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంట కొనుగోలు జరిగేలా చూస్తున్నామని తెలిపారు. గత యేడాది ఇప్పటి వరకు 5 లక్షల 50వేలు క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గత యేడాది కంటే ఈ యేడాది పంట దిగుబడి తక్కువగా ఉండడం వల్ల పంట కొనుగోలు మందకోడిగా కొనసాగుతోందని అన్నారు. అయితే మహారాష్ట్ర నుంచి తెలంగాణకు పత్తి పంట రాకుండా జిల్లాలో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిలో పోలీసు అగ్రికల్చర్ అధికారులు నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. నాణ్యమైన పత్తిని తీసుకువస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించవద్దని రైతులకు సూచించారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ ఉన్నారు.

కొనసాగుతున్న దివ్యాంగుల క్రీడలు



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

బజార్‌హత్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలబాలికల ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. దివ్యాంగ విద్యార్థుల కోసం పాఠశాలల్లో భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల సేవలు అందుతున్నట్లు విద్యాధికారి భగత్ రాంకిషన్, ప్రధానోపాధ్యాయులు భూమన్న తెలిపారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజు బహుమతులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వారితో ఉపాధ్యాయులు రమేష్, బాపురావులు ఉన్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో
తెలంగాణ అప్పుల కుప్ప

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజం
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, రైజింగ్ తెలంగాణ నెంబర్ వన్ 2047 లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ పర్యటన నేపథ్యంలో మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. అయిన్పటికీ ఆ అప్పునకు నెలనెలా వడ్డీ చెల్లిస్తూ కూడా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం విస్మరించకుండా రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ ఆగకుండా ఇచ్చిన హామీలు నెరవేర్చుకుంటు ముందుకు సాగుతుందన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధమైనట్లు, దాదాపు రూ.500 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. పోలీసు స్టాఫ్ క్వార్టర్స్, మహిళల ఆర్థిక ప్రగతి కోసం పెట్రోల్ బంకులు, స్కూల్ బిల్డింగ్స్, తదితర అభివృద్ధి పనులకు పునాది పడనుందన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో రైతుభరోసా, రుణమాఫీ, సన్నబియ్యం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన అభివృద్ధితోనే సమాధానం చెబుతామన్నారు. ఈనెల 8, 9వ తేదీలలో హైదరాబాద్‌లో రైజింగ్ తెలంగాణ నవంబరు వన్ 2047కు రూపకల్పన జరుగుతుందన్నారు. అందులో అన్ని రంగాల ఆర్థిక సంపద ఎలా పెంపొందించాలన్న అంశాలపై చర్చ జరుపుతూ అందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్, నిర్మల్ అసెంబ్లి ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్, శ్యాంనాయక్, శ్రీహరిరావు, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, గోక గణేష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, గంద్రత్ సుజాత, సంతోష్‌రావు, యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ అర్బన్: రెండేళ్ల ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం ప్రజాసేవా భవన్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం ఆదిలాబాద్ పర్యటనకు సంబంధించి శ్రేణులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల అభ్యర్థుల అభ్యర్థుల గెలుపునకు అంతా కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయం సందర్శన

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం ఆదిలాబాద్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. కంది కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఇందులో ఆడే గజేందర్, గోక గణేష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గిమ్మ సంతోష్‌రావు, తదితరులున్నారు.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును
వినియోగించుకోవాలి

- ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్
- ఇంద్రవెల్లిలో ఓటు హక్కుపై స్థానికులకు అవగాహన
- నార్నూర్ మండలం నాగల్‌కొండలో పర్యటన



ఇంద్రవెల్లిలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్



నాగల్‌కొండ గ్రామస్థులతో మాట్లాడుతూ..

ఇంద్రవెల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఓట హక్కును వినియోగించుకోవాలని ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఫిర్యాదు చేసి బాధ్యత గల పౌరుడినని చాటుకోవాలని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ఆయుధాలు ప్రదర్శించినా, విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం, డబ్బు పంపిణీ వస్తువుల రూపంలో బహుమతులు ఇలా ఓటర్లను ప్రభావితం చేస్తూ ప్రలోభాలకు గురిచేసే వారిపై వందకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు ఇందులో స్థానిక ఎస్సై ఇ.సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా స్థానికులు ప్రశాంతంగా ఓటింగ్ జరిపేలా సహకరించాలని ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పోలింగ్ రోజున స్వచ్ఛందంగా అందరూ పాల్గొని ఓటు వేయాలన్నారు. ఎవరైనా ఇబ్బంది పెట్టినచో పోలీస్ సిబ్బందికి లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాలుపడవద్దని సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని ధన్నూర్ గ్రామానికి 40ఏళ్లుగా ఉన్న బస్సు సౌకర్యాన్ని ఎలాంటి కారణం లేకుండా రద్దు చేశారని, దాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని ధన్నూర్ వీడీసీ చైర్మన్ నల్ల రాజేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో డీఎం ప్రతిమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. సర్వీస్ లేని కారణంగా పడుతున్న ఇబ్బందులు డీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించారని గ్రామస్థులు తెలిపారు. 40ఏళ్లుగా ధన్నూర్‌కు బస్సు సర్వీస్ కొనసాగుతుందని, ఇటీవల ఆ సర్వీస్‌ను రద్దు చేసి ఇచ్చోడ నుంచి నడిపిస్తున్నారని ఆయన తెలిపారు. సాయంత్రం వేళలో కూడా బస్సు ఉండడం లేదన్నారు. సర్వీసులను పాత సమయంలో కొనసాగించాలన్నారు. ఇందులో గ్రామస్థులు స్వామి, బుచ్చన్న, భూమారెడ్డి, భూమేష్, తదితరులున్నారు.



ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందిస్తున్న ధన్నూర్ గ్రామస్థులు

నియోజకవర్గ పాస్టర్ల నూతన కార్యవర్గం

ఇచ్చోడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ పాస్టర్ల అసోసియోషన్ బోథ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు ఎస్ నెహెమ్యా తెలిపారు. కార్యవర్గ సభ్యులందరూ కలిసి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని పేదవారికి అండగా నిలవాలన్నారు. కార్యవర్గ ఉపాధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, సభ్యులు హరీష్, సదానందం, రమేష్, రాజు, ప్రభాకర్, సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లైట్ ఆఫ్ గాడ్ అసోసియోషన్ చైర్మన్ లకావత్ పీటర్‌నాయక్, వైస్ చైర్మన్ సదానందం తెలిపారు.

'మూడవ విడత' సన్నద్ధతపై సమావేశం

- పాల్గొన్న ఎంపీడీవో శేఖర్

నేరడిగొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 3వ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల మొదటి దశ సమావేశాన్ని ఎంపీడీవో శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 17న జరగనున్న 3వ విడత పోలింగ్‌కు సంబంధించి మండలంలో ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆర్‌వోలు, ఏఆర్‌వోలను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, నామినేషన్ల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. మూడవ విడతలో భాగంగా డిసెంబరు 3 నుంచి 5 వరకు నామినేషన్లు స్వీకరించనున్నామన్నారు. తహసీల్దార్ కలీం, ఎస్ఐ ఇమ్రాన్, ఎంపీవో శ్యామ్‌సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శేఖర్

కాలుష్య నివారణపై అవగాహన

బజార్‌హత్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు గ్రామంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కాగా పాఠశాల నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీగా వెళ్లి ప్రధాన కూడళ్లలో గోడ ప్రతులు, కరపత్రాలను ప్రదర్శించారు. దీనిలో భాగంగా వీధులలో చెత్త కాల్చవద్దని, ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేయాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. నీటిని పొదుపుగా వాడాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ప్లాస్టిక్ బదులుగా బట్ట సంచులను వాడాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు, వెంకటరమణ, పర్యావరణ ప్రముఖ్ మెస్రం వైష్ణవి, స్వప్న, దుబ్బుల రమణ, మునేశ్వర్ సంపత్, ఆచార్య బృందం, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కాలుష్య నివారణపై ప్రచారం చేస్తున్న విద్యార్థులు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషాకు వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ నియమావళిని ఉల్లంఘించి బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే జీపీలకు రూ.25లక్షల నిధులు ఇస్తామని చెప్పారని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాజిదొద్దీన్ తెలిపారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాజిదొద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి కోడ్ అమలులో ఉందన్నారు. ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే పాయల శంకర్ ఓటర్లు గ్రామ ప్రజలను ప్రలోభాలు పెట్టేలా బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రూ.25లక్షలు ఇస్తామని చెప్పడం ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. అదేవిధంగా ఈ నెల 4న సీఎం సభ కూడా కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని కలెక్టర్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. నిష్పార్థంగా ఎన్నికలు జరిగేలా చూడాలని కలెక్టర్‌కు కోరడం జరిగిందని, అదే సమయంలో ఎమ్మెల్యేపై కోడ్ ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, అశోక్, ప్రశాంత్, కేమ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

లోకో పైలెట్‌ల సమస్యలు పరిష్కరించాలని నిరాహార దీక్ష

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైల్వేలో పని చేస్తున్న లోకో పైలెట్‌ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు సిరాజ్ ఆలం కోరారు. సమస్యల సాధన కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 48 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. రైల్వే స్టేసన్‌లో సిబ్బంది ధర్నా చేపట్టి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు సిరాజ్‌ఆలం మాట్లాడుతూ రైల్వేలో 50 శాతం డీఏను ఉద్యోగులకు పెంచారన్నారు. కాని లోకో పైలెట్‌లను విస్మరించారన్నారు. తమకు కూడా డీఏను పెంచాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా 48గంటల పాటు నిరాహార దీక్ష చేస్తునే రైళ్లను నడిపిస్తూ ధర్నాలు, నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ఇందులో ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, అరవింద్, రూపేష్‌కుమార్, అమిత్‌కుమార్, హేమంత్, తదితరులున్నారు.



నిరాహార దీక్షలో పాల్గొన్న లోకో పైలెట్లు

ఈ మూల మలుపులు.. ప్రమాదాలకు నెలవులు!

- ప్రమాదకరంగా పలు గ్రామాల రహదారులు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : స్థానికులు

జర.. దేఖో!!



రాంలింగంపేట్-హస్నాపూర్ మధ్య ఉన్న రోడ్డుపై ఉన్న మలుపులు



రోడ్డుకు ఇరువవు ఏపుగా పెరిగిన చెట్లపొదలు

ఉట్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌లింగంపేట గ్రామం మీదుగా హస్నాపూర్ గ్రామం వైపు వెళ్లే రహదారుల్లో ఉన్న మూలమలపులు ప్రమాదాలకు నెలవులుగా మారాయి. ఉట్నూర్ నుంచి హస్నాపూర్, నార్నూర్, గాదిగూడ, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ), తదితర మండలాలకు వెళ్లే ప్రజలు తుకారం లింగోజి తండా ఎక్స్ రోడ్డుకు వెళ్లకుండా గత సంవత్సరం క్రితం నిర్మించిన ఉట్నూర్ నుంచి పాత ఉట్నూర్, రామ్‌లింగంపేట మీదుగా హస్నాపూర్ సమీపంలోని ఆర్ అండ్‌బి రహదారి వరకు నిర్మించిన రోడ్డుపై బైకులు, కార్లు, జీపులలో, వ్యాన్లలో, ఆటోలలో ప్రయాణించే వారు ఈ మార్గంలో అధికంగానే రాకపోకలు సాగిస్తుంటారు.

కలిసి వస్తున్న దూరం

ఈరోడ్డు మార్గం గుండా రావడం వల్ల ఆరు కిలోమీటర్ల దూరం కలిసి వస్తుండడంతో అధిక మొత్తంలో ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో అధికంగా మూల మలుపులు ఉండడంతో పాటు రోడ్డు పక్కన చెట్ల పొదలు పెరిగిపోవడంతో ఎప్పుడు ప్రమాదం ? ఎక్కడ జరుగుతుందో? అన్న అనుమానాలు స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రమాదాలు నివారణ కోసం జాగ్రత్తలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సోనాలలో ఏఆర్‌వోలతో మాట్లాడుతున్న ఎంపీడీవో



తలమడుగులో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

నేటి నుంచి మూడో విడత నామినేషన్లు

బజార్‌హత్నూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల సమరం ఊపందుకోనుంది. మండలంలో 31 గ్రామ పంచాయితీలలో 244 వార్డులకు గాను 23,829 ఓటర్లు తమ ఓట్లు వినియోగించుకోనున్నారు. మూడో విడత నామినేషన్లలో భాగంగా బుధవారం నుంచి ఆరు క్లస్టర్లలలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేది వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. అనంతరం 6న నామినేషన్ల పరిశీలన, 9న ఉపసంహరణ ఉంటుందన్నారు. ఈ నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

తలమడుగు: గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో శంకర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలో మూడో విడత ఎన్నికలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అదే విధంగా ఎన్నికల అధికార ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 29 గ్రామ పంచాయితీ నామినేషన్లు బుధవారం ప్రారంభం కానున్నాయి. గ్రామ పంచాయితీ మూడవ దశ సాధారణ ఎన్నికలలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌వో, ఏఆర్‌వోలు, సెక్రెటరీలతో సమావేశం నిర్వహించి ఎన్నికలు సక్రమంగా జరిగేలా అధికారులకు ఎంపీడీవో శంకర్ అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు. మండలంలోని ఏడు క్లస్టర్లలో స్థానిక గ్రామ పంచాయితీ భవనాల్లో నామినేషన్లు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు.

బోథ్: బుధవారం నుంచి బోథ్, సోనాల మండలాలలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. దీంతో మంగళవారం ఎంపీడీవోలు మహేందర్, ఎల్.రమేష్‌లు ఆయా గ్రామాలలో ఏఆర్వోలుగా వ్యవహరించే అధికారులకు సంబంధించిన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు ఏఆర్‌ఓలకు నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సీఎం పర్యటనపై.. ఆశలు

(5వ పేజీ తరువాయి...)

రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటి పరిధిలో యూఐ డీఎఫ్ నిధుల కింద రూ.18.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట స్థలంలో రూ.1.75 కోట్ల వ్యయంతో మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ భూమిపూజ, రూ.కోటి సీఎస్‌ఆర్ నిధులతో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు భూమిపూజ, నూతన కలెక్టరేట్ భవనం వద్ద రూ.2.31 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు భూమిపూజ పోలీస్ క్వార్టర్స్ ఎదుట డీఎస్పీ, సీ క్వార్టర్లు, ఏఆర్ డీఎస్పీ, అడ్మిన్ డీఎస్పీ, వీసీ క్వార్టర్స్ ప్రారంభం, సాత్నాల బస్టాండ్ సమీపంలో భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం : పీడీఎస్‌యూ

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తి విఫలమందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా 20వ మహాసభలను పట్టణంలోని కుమరంభీం భవన్‌లో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు అమరుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిసాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాలు, సాధించిన విజయాలను తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యరంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌పై ఆధారపడి విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రూ.8,500 కోట్ల బకాయిలు ఉన్న కారణంగా వారు ఉన్నత విద్యను అభ్యసించ లేక డ్రాప్ అవుట్ అవుతున్నారన్నారు. ఇందులో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు వెంకటేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరీష్, గణేష్, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కళావతి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు దీపలక్ష్మి, సహాయ కార్యదర్శి దత్తాత్రి, కోశాధికారి నాగేందర్, తదితరులున్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఆర్బీఐ కౌన్సిలర్

నేరడిగొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో కొత్త రకాల మోసాలతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత ఆర్‌బీఐ కౌన్సిలర్ వర్ని సంతోష్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, మండల వైద్యాధికారి డాక్టర్ సద్దాం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ని సంతోష్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కౌన్సిలర్ అరవింద్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్బీఐ కౌన్సిలర్ వర్ని సంతోష్



ఎన్నికల సామగ్రిని ఆర్‌వోలకు అందజేస్తున్న అధికారులు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- 19 గ్రామ పంచాయతీలను ఐదు క్లస్టర్లుగా విభజన
- సంబంధిత సామగ్రిని తీసుకెళ్లిన అధికారులు

ముథోల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత ఎన్నికలలో భాగంగా ముథోల్‌లో బుధవారం నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మండలంలో ఎన్నికల ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలను అధికారులు ఐదు క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్ల ఆధారంగా ఎన్నికల నిర్వహణ సులభంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో లవ కుమార్ తెలిపారు. బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండటంతో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు మంగళవారం మండల అభివృద్ధి కార్యాలయంలో నామినేషన్ కేంద్రాల ఆర్‌వో, ఏఆర్‌వోలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, తదితరులున్నారు.

మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

తానూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలూరు గ్రామంలో మున్నూరు కాపు కులస్తులు మున్నూరుకాపు సంఘ భవనంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జే.ధర్మేందర్, ఉపాధ్యక్షుడిగా ఎం.మురళి, క్యాషియర్‌గా ముత్యం, సురేష్‌లు, మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు కోలూరు గ్రామ అధ్యక్షుడు జే. ధర్మేందర్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ బలోపేతానికి తనవంతు కష్టపడి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపులు ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మోకుదెబ్బ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్‌ను వారి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడకులస్తుల సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

నిర్మల్‌రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం లోని శ్రీగిరి క్షేత్రంలో గల శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి కావడి సేవ, రథ సేవ, పంచామృతాలతో అభిషేకించినట్లు గురుమాత రాజరాజేశ్వరి దేవి ఆర్కారి రాజవ్వ తెలిపారు.

రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల స్వీకరణ





కొండాపూర్, సిద్దులకుంటలో రాత్రి వరకు నామినేషన్లను స్వీకరిస్తున్న అధికారులు

సోన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలో నామినేషన్ల స్వీకరణ మంగళవారం రాత్రి తర్వాత కూడా కొనసాగింది. రెండో విడత నామినేషన్లకు చివరిరోజు కావడంతో ప్రధాన పార్టీల మద్దతుదారులు చివరి నిమిషంలో దాఖలు చేయడానికి కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో మండలంలోని సిద్దులకుంట, కడ్తాల్‌లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. చివరిరోజు ఎన్ని నామినేషన్ పత్రాలు వచ్చాయో అధికారులు లెక్క తేల్చలేదు.

నిర్మల్‌రూరల్: రెండో విడత సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ఘట్టం మంగళవారం రాత్రి దాటే వరకు మండలంలోని కొండాపూర్, న్యూ పోచంపాడ్, వెంగ్వాపేట్ గ్రామాల్లో కొనసాగింది. చివరి రోజు కావడంతో ఆశావాహులు సాయంత్రం ఐదు గంటల లోపు పెద్ద ఎత్తున నామినేషన్ కేంద్రాల వద్దకు భారీగా తరలివచ్చారు. నామినేషన్ల స్వీకరణ కోసం కార్యాలయంలో ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి స్వీకరణ కొనసాగించారు. ఒకేసారిగా భారీ సంఖ్యలో నామినేషన్లు రావడంతో వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం రాత్రి వరకు కొనసాగింది. ఈ ఆలస్యం కారణంగా ఏ గ్రామ పంచాయతీకి ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని పూర్తివివరాలు అర్ధరాత్రి వరకు ప్రకటించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలి

- ముథోల్‌లో ప్రపంచ మహా సభల కరపత్రాల ఆవిష్కరణ



ప్రపంచ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముథోల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ 3వ తెలుగుమహాసభల ఆత్మీయ ఆహ్వాన పత్రాలు, కరపత్రాలను మల్లినాథ సూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, పద్యకవి డా.బి. వెంకట్ రబీంద్ర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. జనవరి 3, 4, 5వ తేదీల్లో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు సమీపాన గల అమరావతిలో జరుగనున్నాయని అన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారన్నారు. ప్రముఖ కవయిత్రి రమావత్ నిర్వాహకుల్లో ఒకరిగా బాధ్యతలను స్వీకరించారన్నారు. ప్రపంచస్థాయిలో మహాసాహితీ మేధావులు, ప్రముఖులు పాల్గొననున్నారన్నారు. ప్రపంచ 3వ తెలుగు మహాసభల్లో కవులు, కళాకారులు, తెలుగుభాషా పండితులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కవి శ్రీనివాస్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జే. ప్రతాప్, చైర్మన్ భీమ్ రావు దేశాయ్, డైరెక్టర్ పోతన్న యాదవ్, కరస్పాండెంట్ రాజేందర్, రబీంద్ర ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హేమలత, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జీలు బి. సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపెల్లిలో అదనపు కలెక్టర్ పర్యటన

- శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ పరిశీలన

ఖానాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్తెనపెల్లి గ్రామంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకును పరిశీలించారు. మంచినీటి ట్యాంకు ప్రమాదకరంగా మారిందని, ట్యాంకు శిథిలావస్థకు చేరినందున దానిని తొలగించేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయనవెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, డీఈఈ హరీష్, ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, ఏఈఈ కృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్ ఉన్నారు.



తాగునీటి ట్యాంకులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



కాంగ్రెస్‌లో చేరుతున్న కజ్జర్ల మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి

బీఆర్ఎస్‌కు మరోషాక్

- కాంగ్రెస్‌లో చేరిన కజ్జర్ల మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి

తలమడుగు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలవేళ బీఆర్ఎస్ పార్టీకి మరోషాక్ తగిలింది. తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సినీయర్ నాయకుడు మాజీసర్పంచ్ ఎల్మ నారాయణరెడ్డి, వార్డు మెంబర్ గంట దేవిదాస్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి కండువాకప్పిన మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతను సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కమలాకర్, వెంకన్న యాదవ్, మాజీసర్పంచ్ ఎంగణేష్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, పోశెట్టి, పూర్ణచేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

సోన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెంపేట్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ మారి విలాస్‌తో పాటు ముఖ్య నాయకులు కస్తూరి నారాయణ, ద్యావత్ శ్రీనివాస్, ద్యావత్ ప్రశాంత్, కస్తూరి శ్రీనివాస్, తాళ్ళ ప్రవీణ్, బంక మణికిరణ్, జొర్రిగ సంతోష్, బంక అన్వేష్, సంఘం గణేష్, సంగెం ప్రశాంత్‌తో పాటు 30 మంది యువకులు, కార్యకర్తలు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి. నాయకులు అంకం శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, భీమ్ రావు ద్యావతి ప్రశాంత్‌తో పాటు మండల గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

వేలం ద్వారా ఏకగ్రీవాలు నేరం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచులు, వార్డుల సభ్యులను వేలం ద్వారా ఎన్నుకుంటే అది చట్టరీత్యా నేరమని ఆ ఎన్నిక చెల్లదని ఎంపీడీవో రాజాశ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. మండలంలోని అమీర్‌నగర్, కోనాసమందర్, కేసీతండా, డీసీ తండా తదితర గ్రామాల్లో పర్యటించి, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. గ్రామాభివృద్ధి కమిటీలు, ఇతరులు వేలం పాట ద్వారా సర్పంచ్, వార్డు సభ్యులను ఎంపిక చేయొద్దని సూచించారు.

కల్లబొల్లి మాటలు నమ్మొద్దు..రామన్న..!



ముథోల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ బరిలో దిగే నాయకులు ఓటరు మహాశయులకు ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటి నుండే కుల సంఘాలకు, యూత్ సభ్యులకు మీటింగ్‌లు పెడుతూ బరిలో ఉంటున్న దయ చూపండి మీ వెంటనే ఉంటా, గ్రామం మనది, మంచి చేద్దాం అంటూ కాకా పడుతున్న సందర్భంగా ఇద్దరు రైతుల మధ్య జరుగుతున్న రచ్చ బండ ముచ్చట్లు చూడండి మరి.

మల్లన్న:ఏందే ఎల్లన్న... యాడికి పోతున్నా వమ్... తిన్నవా.

ఎల్లన్న:గిప్పుడే తిన్న మాకులపోల్లు మీటింగ్ పెట్టింన్రు.

మల్లన్న: ఏ మీటింగ్ అయి ఉంటాది.

ఎల్లన్న: గీ ఎలచ్చన్ల లొల్లి నడుతుంది గదా ఓటు ఎవలికి ఎయ్యాలి, ఎవలు ఏమి ఇత్తరు సంఘానికి అన్న ముచ్చట కావచ్చు. పోతే గాని తెల్వద్... పోయస్తా.

మల్లన్న: ఇది ఎలచ్చన్ల పండుగ ఎల్లన్న గా... లీడర్లపని గిప్పుడు అవిజేస్తాం. ఇవి జేస్తాం. మస్తు మాటలు జెప్పి మభ్యపెడుతారు. ఓట్లు దండుకుంటారు. అన్న గిప్పటి దాకా ఏమి జేసింన్రు గిప్పుడెము జేస్తారు.... గసుంటి మాటలు నమ్మద్దు.అర చేతులో సర్గం జూపు తారు.

ఎల్లన్న:గట్లనా మల్లన్న...గా...మనుషులు పెద్ద లీడర్లు గదా మాట తప్పుతరంటావా.

ఎల్లన్న : అన్న నీకు ఎం తెల్వద్... పోయిన ఎలచ్చన్ల గా... లీడర్ వచ్చి మా సంఘంకు జాగ ఇస్తామన్నారు. మాకులమొల్లకు ఆదుకుంటామని జెప్పి అదిజెత్తం, ఇది జెత్తం అని పోయింన్రు. సర్పంచ్ అయ్యాక మాట మార్చిండు మల్ల గీ...యేడే కనబడుతుంన్రు... కల్లిబొల్లి మాటలు నమ్మద్దు. ఓడదాటిందాక ఓడ మల్లన్న... ఓడ దాటినంక బోడి మల్లన్న... అంటారు.

మల్లన్న: గట్లగూడా జేస్తారా. ఎల్లన్న... గీ... పెద్ద మనుషులు సరే మీటింగ్‌కు పోతున్న సంగదంత తెలుస్తాది.

ఎల్లన్న:చూడు మల్లన్న మీటింగ్‌లో గా... నాయ కులు ఎమన్నా జెప్పని కానీ నీకు పని చేసే నాయకునికి ఓటు వేయి. ఊరుకు మంచి చేసే నాయుడుకి సర్పంచ్ చేయాలి.

మల్లన్న: మంచి మాట జెప్పినవ్... ఎల్లన్న గట్లనే సోన్నాయిస్తా... మీటింగ్ పోతా. చెప్పింది ఇనుకుంటా. నమ్మకం ఉన్న లీడర్‌కు ఓటు వేస్తా. సరే పయిలం గట్లాగే..

అభ్యర్థులూ.. ఖర్చు మించొద్దు..

భైంసా,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల బరిలో ఉంటున్న అభ్యర్థులు మితిమీరి ఖర్చు పెడితే ఇబ్బందుల పాలవుతారు.ఎన్నికల సంఘం నిబంధనల మేరకే సర్పంచ్, వార్డు సభ్యులు ప్రచారానికి ఖర్చుపెట్టాల్సి ఉంటుంది.పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమ,నిబంధనలకు అనుగుణంగా ప్రచారానికి ఖర్చుచేస్తున్నారా.?అన్నవిషయంపై వ్యయపరిశీలకుల టీమ్‌లు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిశీలిస్తుంటారు.ప్రచారంవాహనాలకుతప్పని సరిగా అనుమతి ఉండాలి.



● సర్పంచ్‌కు వ్యయ పరిమితి ఇదే...

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ఖర్చు వివరాలు తప్పనిసరిగా తెలుసుకోవాలి. 5వేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు సర్పంచ్‌కు రూ.2.50 లక్షలు, వార్డు మెంబర్‌కు రూ.50వేలు ఖర్చు పెట్టాలి. 5వేలలోపు జనాభా ఉన్నగ్రామాల్లో సర్పంచ్‌కు రూ. 1.50లక్షలు, వార్డు మెంబర్‌కు రూ. 30వేలు ఖర్చు పెట్టాలని ఎన్నికల నిబంధనలను సూచిస్తున్నాయి.

● నెలన్నర లోగా....

పంచాయతీ ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా పోటీ చేసిన అభ్యర్థులు తప్పకుండా తమ ఖర్చుల వివరాలను అధికారులకు అందించాలి. నిబంధనల మేరకే ఎన్నికల ఖర్చు ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చులంటే సదరు అభ్యర్థులను మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తారు. పై నిబంధనలు పాటించాలి.

దత్త జయంతికి ముస్తాబు

» ప్రారంభమైన ఉత్సవాలు
» ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న గండి రామన్న క్షేత్రం
» దినదినాభివృద్ధి చెందిన సాయిబాబా ఆలయం
» భక్తుల కోరిన కోరికలు తీర్చే దైవంగా ప్రతీతి
» ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న 'లక్కడి' సోదరులు



దత్తాత్రేయ విగ్రహం

నిర్మల్‌చైన్‌గేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ శివారులోని శ్రీ గండి రామన్న దత్తసాయి ఆలయం దత్త జయంతి వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రారంభైన దత్త జయంతి ఉత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా జరిగే దత్త జయంతి వేడుకల కోసం దేవాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అఖండ సాయి నామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం 48 గంటల పాటు నిరాటంకంగా కొనసాగుతుంది. రెండో రోజైన నేడు సాయిబాబాకు మంగళస్నానం, అర్చన ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం పట్టణ పురవీధుల గుండా సాయి రథం ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. అలాగే చివరి రోజునై గురువారం దత్త జయంతిని పురస్కరించుకొని ఉదయం ఐదున్నర గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 11 గంటలకు అఖండ సాయి నామ సంకీర్తన ముగుస్తుంది. అనంతరం మధ్యాహ్న హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు.



లక్కడి జగన్మోహన్ రెడ్డి

ఆధ్యాత్మికం

ఆధ్యాత్మికతకు నిలయంగా గండి రామన్న క్షేత్రం

గత కొంతకాలంగా దేవాదాయ శాఖ నిధులతో పాటు ఇక్కడి ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన లక్కడి జగన్మోహన్ రెడ్డి సోదరులు తమ సొంత నిధులను సైతం వెచ్చించి ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఆలయాన్ని విస్తరించడంతో పాటు భక్తులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించడంతో ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకుపెరుగుతోంది. దేవాదాయ శాఖ నిధులు 2.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. వీటిలో కల్యాణ మండపం, అతిథి గృహాలు, వాహన పూజ షెడ్, కార్యాలయ గది మొదలైనవి ఉన్నాయి. అలాగే లక్కడి జగన్మోహన్ రెడ్డి, ఆలయ సోదరుడు లక్కడి జైపాల్‌రెడ్డిలు తమ తల్లిదండ్రులు లక్కడి క్రిష్ణవేణి, రాంరెడ్డిల జ్ఞాపకార్థం గండి రామన్న క్షేత్రం అభివృద్ధి కోసం 2.79కోట్ల సొంత నిధులను వెచ్చించారు. వీటిలో శివాలయం, దక్షిణాభిముఖ ఆంజనేయ స్వామి విగ్రహం, నందదీప్, గురుస్నాన్, ద్వారకామాయి, చావడి తదితర నిర్మాణాలు ఉన్నా యి. అలాగే ఇక్కడి సాయిబాబా ఆలయంలో ఉన్న పాత విగ్రహ స్థానంలో షిరిడీ తరహాలో ఉన్న నూతన సాయిబాబా విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. ఇక్కడ ప్రతిష్ఠించిన సాయినాథుని ప్రతిమ షిరిడీలో మినహా మరెక్కడా కనిపించదు. దీంతో ఇక్కడికి వచ్చే సాయి భక్తులు తమ మొక్కులు తీర్చుకొని ఎంతో తన్మయత్వం చెందుతారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని దత్తాత్రేయ ఆలయంలో పాత దత్తాత్రేయుని విగ్రహం స్థానంలో నూతన దత్తాత్రేయుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతేకాకుండా సాయిబాబా గర్భగుడి లోని గోడలకు, అర్చీలకు పంచలోహ తాపడం చేయించారు. ఆలయ పరిసరాల్లో ఆకుపచ్చని తీవాచీ పరచినట్లు, సుందరీకరణ, గోశాల మందిర నిర్మాణం చేపట్టారు. ఉత్సవాల సమయంలో సాయిబాబా ఊరేగింపు నిర్వహించేందుకు సాయి రథాన్ని తయారు చేయించారు.




గోశాల మందిరం



సాయిబాబా విగ్రహం

అలాగే ఆలయానికి సంబంధించిన 13 ఎకరాల స్థలాన్ని సంరక్షించేందుకు ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి, ఆధ్యాత్మిక పనులు చేపట్టడంతో ఇక్కడి గండి రామన్న క్షేత్రం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అటు దేవాదాయ శాఖ, ఇటు జగన్మోహన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి సోదరులు ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేయడంతో గండిరామన్న క్షేత్రం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ప్రతిరోజు ఆలయాన్ని దర్శించుకునేందుకు నిర్మల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో గండి రామన్న క్షేత్రం ఈ ప్రాంతంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో పచ్చదనాన్ని ఏర్పాటు చేయడంతో ఎంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. దీంతో మానసిక ప్రశాంతత కోసం ఇక్కడికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.



ఆలయ ఆవరణలో సాయిబాబా విగ్రహం

జిల్లా పై చలిపంజా...

» భీంపూర్ అర్లి(టి)లో 10.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లాపై చలిపంజా విసురుతోంది. గత పక్షం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. మంగళవారం జిల్లా గరిష్ఠఉష్ణోగ్రత 28.3 డిగ్రీలుగా నమోదుకాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 10.2డిగ్రీలుగా నమోదైంది. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది.ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 5గంటల వరకే పనులను ముగించుకుని ఇండ్లలోకి వెళ్లి పోతున్నారు.రాత్రిపగలు అనే తేడాలేకుండా వెచ్చని దుస్తులను ధరిస్తున్నారు. చలి తీవ్రతకు చలిమంటలు వేసుకుంటూ..వెచ్చదనం పొందుతున్నారు. అలాగే పశువులు కూడా చలికి అనారోగ్య భారీన పడే అవకాశం ఉండడంతో రాత్రివేళల్లో ఆరుబయట ఉంచకుండా ఇండ్లలోనే ఉంచుతున్నారు. కొందరైతే పశువులకు, పెంపుడు కుక్కలకు గోనే సంచులు కప్పి వెచ్చదనాన్ని కల్పిస్తున్నారు. ప్రతియేటా జిల్లాలో డిసెంబరు మాసంలోనే రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.రాబోయే రోజుల్లో మరింతగా చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందంటున్నారు. సాత్నాలలో 11.4, ఆదిలాబాద్‌రూరల్ పిప్పల్‌ధరిలో 11.7, బేలలో 11.8, తాంసిలో 12.0, ఆదిలాబాద్ అర్బన్‌లో 12.1డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో డిసెంబరు, జనవరి మాసాలను అతి శీతల మాసాలుగా పరిగణిస్తారు. ఈ నెల చివరి వరకు ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.



ఉదయం వాకింగ్ చేస్తున్న వాకర్స్



పట్టణ పరిసరాలను కప్పేసిన పొగమంచు

కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలి

» విశ్రాంత కార్మిక శాఖ అధికారి చిట్యాల జగదీశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):కార్మిక శాఖ ద్వారా కార్మికులకు అందే సంక్షేమ ఫలాలు అందించాలని గత 20 ఏళ్లుగా కోరుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విశ్రాంత కార్మిక శాఖ అధికారి చిట్యాలజగదీశ్‌రెడ్డి అన్నారు.ఈ నెల 4న సీఎం రాక సందర్భంగా తమను కలిసి బాధలు చెప్పుకునేలా అవకాశం కల్పించాలని మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి అవే పథకాలు కొనసాగుతున్నాయన్నారు.గత బీఆర్‌ఎస్ కార్మిక సంక్షేమ పథకాలను పెంచాలనే ఉద్దేశ్యాన్ని నీరుగార్చిందన్నారు.ఇప్పుడు ఉన్నకాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదన్నారు. సీఎం నుంచి మంత్రుల వరకు విన్నపాలు ఇచ్చిన పట్టింపు లేదన్నారు. పక్క రాష్ట్రం అయిన ఏపీలో పథకాలను పెంచి కార్మికులకు లాభం చేసిందన్నారు.కాని తెలంగాణ మాత్రం ఈఫైల్ ఇంకా సీఎం పేషీలో పెండింగ్‌లోనే ఉందన్నారు. ప్రభుత్వానికి లాభాలు తీసుకువస్తున్నా కార్మిక విన్నపాలపై ఎందుకు చిన్నచూపని ప్రశ్నించారు. ఈ నెల 4న సీఎంను కలిసి బాధలు చెప్పడానికి అవకాశం ఇవ్వాలని కోరారు.

కనీస వేతనం చెల్లించాలని నిరసన

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):రిమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి రిమ్స్‌లోని అవుట్ పేషెంట్ బ్లాక్ ఎదుట పెండింగ్‌లో ఉన్న ఈఎస్, పీఎఫ్‌తో పాటు వేతనాలు చెల్లించాలని నిరసన తెలిపారు. బ్లాక్ ఎదుట బైఠాయించి ప్రభుత్వం, అధికారులు, కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రిమ్స్‌లో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. నాలుగు నెలల నుంచి పీఎఫ్, ఈఎస్‌ఐ పెండింగ్‌లో ఉందన్నారు. అదే విధంగా వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు వారి ఖాతాలో వేతనాలు జమ చేయాలని, సీనియార్టీ ప్రకారం పేషెంట్ కేర్ పదోన్నతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రమ, అనసూయ, కార్మికులు పాల్గొన్నారు.

అర్లి (టి)లో విద్యుత్ పునరుద్ధీకరణ

భీంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలం అర్లి(టీ) విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో సమవరం రాత్రి విద్యుత్ తీగలు తెగటంతో అర్లి (టీ) క్లస్టర్‌లో నామినేషన్ దాఖలుకు ఇబ్బందులు ఎదురైన విషయం ఆంధ్రజ్యోతిలో అర్లి (టి) క్లస్టర్‌లో కరెంట్ కష్టాలు శీర్షికన కథనం వచ్చింది. దీనికి స్పందించిన అధికారులు తక్షణం మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దాని ఫలితంగా అర్లి(టి)సహా మిగతా గ్రామాలలో విద్యుత్ సరఫరా కష్టాలు తప్పాయి. మంగళవారం చివరి రోజు నామినేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయింది. గ్రామ ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్న దృశ్యం

మండలంలో ఐదు గ్రామాలు ఏకగ్రీవం

భీంపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసి గ్రామాల్లో సర్పంచులు, వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు.టెక్డి రాంపూర్‌కు సర్పంచ్‌గా మాడావి అశోక్, కరణ్‌వాడి సర్పంచ్‌గా సీడం విలాస్, మరక గూడ సర్పంచ్‌గా కుడిమేత లత, భగవాన్ పురసర్పంచ్‌గా ఆడ యువరాజ్, జలకిరి సర్పంచ్ మాడావి లక్ష్మీబాయిలకు సంబంధించిన నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. పరిశీలన తర్వాత అధికారులు ఏకగ్రీవాలను ధ్రువీకరించనున్నారు.కాగా ఇందులో భగవాన్ పూర్‌కు తాజా మంజి సర్పంచ్‌గా ఆడ రేష్మ ఉండగా ఇప్పుడు ఏకగ్రీవ సర్పంచ్‌గా మళ్లీ భర్త యువరాజ్‌కి వచ్చింది. అలాగే జాలకోరి మాజీ సర్పంచ్‌గా మాడావి అనిల్ ఉండగా ఇప్పుడు భార్య లక్ష్మీ బాయికి కూడా ఏకగ్రీవ సర్పంచ్‌గా అవకాశం వచ్చింది. ఆదివాసీ పంచాయతీలలో ఏకగ్రీవాలు ప్రగతి చైతన్యానికి సూచిక అని స్థానికులు భావిస్తున్నారు.

నామినేషన్ ఎప్పుడు వేద్దాం

» ముహుర్తాల కోసం పంతుళ్ల వద్దకు పరుగు

బోథ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత ఎన్నికల సందర్భంగా బోథ్ సోనాల మండలాల్లో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ముహుర్తాల ఓ పంతుల వద్దకు పరుగులు తీస్తున్నారు. నాకు గురు బలం ఉందా ఏ సమయంలో నామినేషన్ వేయాలి మంచి ముహుర్తాల కోసం పంచాంగం చూపించుకుంటున్నారు. బుధవారం నుంచి నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికలు అవసరమైన ఏర్పాట్లను చేసుకుంటు బిజిబిజీగా ఉన్నారు. ఏది ఏమైన అభ్యర్థులు వారి బలాన్ని ఎలా ఉందో చూపిస్తున్నారు.

ఒంటి చేయితో.. కుటుంబ బాధ్యతలు



ఒంటి చేత రిక్షాన్ని లాగుతున్న షారూక్



సంకల్పం ఉంటే మనిషి అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చన్న విషయాన్ని పట్టణానికి చెందిన షారూఖ్ నిజం చేసి చూపుతున్నారు. ఎనిమిదేళ్ల కిందట ప్రమాదంలో ఓ చేయి కోల్పోయి ఆయన అధైర్యపోకుండా కుటుంబ బాధ్యతలను మోస్తున్నాడు. ఒంటి చేత్తోనే రిక్షా లాగుతూ, పంక్చర్ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. చేయి కోల్పోయినా ధైర్యం కోల్పోలేదని నిరూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్

బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ సీనియర్ నేత



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, దండోరా సంఘం అధ్యక్షులు జువ్వక సంటెన్న మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంటెన్న మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా పెరుగుతోందని అన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిరంతర పర్యటనలు, ప్రజలతో మమేకమవుతున్న తీరు వారిలో నమ్మకాన్ని పెంచుతోందని, అందుకే తాను బీఆర్‌ఎస్‌లో చేరానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోని వైఫల్యాలు, అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతుదారుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి

బోథ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ప్యానల్ టీం బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా బృందంలో ఏడుగురు సభ్యులు వచ్చారు. ఈ సందర్భంగా వారు మోడల్ స్కూల్‌లోని వసతులను పరిశీలించారు. అంతేకాక మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉన్న ఇబ్బందులు ఏమిటి అనే విషయాన్ని నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.మరోవైపు పాఠశాలలో పరిశుభ్రత ఏవిధంగా ఉంది భోజనాన్ని ఏవిధంగా వడ్డిస్తున్నారు.రుచికరంగా ఉందా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లను పరిశీలించిన అనంతరం విద్యాబోధనపై విద్యార్థులను అడగడం జరిగింది. స్టోర్ రూమ్‌లో పరిశీలించి కిచెన్‌లో పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసప్రసాద్‌తో పాటు ప్రిన్సిపాల్ అనురాధ, టీచర్లు పాల్గొన్నారు.


యువకుల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

బోథ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోనాల కేంద్రంలో ద్విచక్ర వాహనం, ఆటో నడుపుతున్న యువకుల మధ్య మంగళవారం గొడవ జరిగిందని ఎస్సై శ్రీసాయి తెలిపారు. అయితే యువకులు ఒకరిపై ఒకరు పరస్పర దాడులకు పాల్పడడంతో జరుపుకోవడంతో ఒకరికి తలకు తీవ్ర గాయాలు కావడంతో దాడికి పాల్పడిన నలుగురు యువకులు జాదవ్‌జైపాల్ సాయికిరణ్, కిషన్‌చౌహాన్, సాయిలపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై శ్రీసాయి తెలిపారు.

నామినేషన్లకు రంగం సిద్ధం

» ఎన్నికల సామగ్రి పంపిణీ

నేరడిగొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి నుంచి జరగనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శేఖర్ అన్నారు. మంగళవారం ఆర్వో ఏఆర్వోలకు , ఎంపీడీవో, తహసీల్దార్ ఎస్సై, ఎంపీవోల సమక్షంలో ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కచ్చితంగా ఎన్నికల కోసం కొత్త బ్యాంక్ ఖాతా లేదా పోస్టల్ ఖాతాను తెరవాలని, ఆ ఖాతా వివరాలను అధికారులకు సమర్పించాలని సూచించారు.



పల్లెలపై పోలీసుల నజర్

జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో జరగనున్న సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల కోసం పోలీసులు గట్టి బందోబస్తు చేశారు. నామినేషన్ల నుంచే పోలీసులు రంగంలోకి దిగి ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఎస్పీ జానకీ షర్మిల ఇప్పటికే జిల్లాలోని అన్ని పీఎస్‌ల సీఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించి నిఘా, శాంతి భద్రతల చర్యలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు.



ఎన్నికల బందోబస్తుపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

- పంచాయతీ ఎన్నికల కోసం భారీ బందోబస్తు
- మూడు విడతల్లో వ్యూహాత్మక పోలిసింగ్
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- అక్కడ ప్రత్యేక భద్రత చర్యలు
- ఇప్పటికే చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా
- మద్యం, డబ్బుల పంపిణీ అడ్డుకట్టకు చర్యలు



వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

నిర్మల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 844 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. గతంలో జరిగిన ఘటనలతోపాటు కొంతకాలం నుంచి ఆయా గ్రామాల్లోని శాంతిభద్రతల సమస్యలను పరిగణలోకి తీసుకొని అక్కడ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోబోతున్నారు. మూడు నాలుగు గ్రామాలకు సంబంధించి ఓ సీఐని నియమిస్తున్నారు. దీనికి అనుగుణంగా రూట్‌మ్యాప్ కూడా రూపొందించారు. ఈ రూట్ మ్యాప్ ప్రకారం అడిషనల్ ఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఏఎస్ఐలు బందోబస్తు చర్యల్లో పాల్గొననున్నారు. అలాగే ఇప్పటికే జిల్లా సరిహద్దుల్లో ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి దేశీదారు, నగదు రాకుండా అడ్డుకుంటున్నారు.

ఇప్పటికే అదనపు బలగాలను ఇక్కడికి రప్పిస్తున్నారు. మూడు దశల్లో ఎన్నికలు జరగనున్న కారణంగా మొదటి దశ ఎన్నికల తరువాత అక్కడి పోలీసు సిబ్బందిని రెండో దశ కింద జరగే గ్రామాల్లో పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించనున్నారు. అలాగే మూడో దశ కింద జరగబోయే ఎన్నికలకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయనున్నారు.

844 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 400 గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులున్నాయి. మొత్తం 3368 పోలింగ్ కేంద్రాలను 400 గ్రామ పంచాయతీల కోసం ఏర్పాటు చేశారు. అయితే మొత్తం 844 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో అత్యధికంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుండడంతో పోలీసులు ఇటువైపు దృష్టి సారిస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనల ఆధారంగా పలువురిని బైండోవర్ కూడా చేస్తున్నారు. అలాగే ఈ పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల్లో ప్రత్యేక నిఘా సారిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై దృష్టిపెడుతూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రాత్రివేళ డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా అలాగే వివాదాలు, ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో పోలీసులు నిమగ్నమయ్యారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా

జిల్లా సరిహద్దుల్లో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పొరుగు రాష్ట్రం నుంచి మద్యం, నగదు తరలిరాకుండా ఈ చెక్‌పోస్టుల వద్ద నిఘా సారిస్తున్నారు. ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతూ అపరిచిత వ్యక్తులను ఆరా తీస్తున్నారు. పొరుగు రాష్ట్రం నుంచి నకిలీ ఓటర్లు తరలివచ్చే అవకాశాలు కూడా ఉండడంతో ఆ కోణంలోనూ పోలీసులు దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

అభ్యర్థుల ఖర్చుపైనా ఫోకస్

ఈసారి మూడు పార్టీల అభ్యర్థులు పార్టీ గుర్తులు లేకుండానే పోటీ చేయనుండడంతో ఆ పార్టీలన్నీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఖానాపూర్‌లో డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు, నిర్మల్‌లో మాజీ డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ శ్రీహరిరావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్‌లు కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. బీజేపీ తరఫున నిర్మల్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్‌లో అక్కడి ఎమ్మెల్యే రామారావు పటేల్‌తోపాటు ఖానాపూర్‌లో పార్టీ అధ్యక్షులు రితేష్ రాథోడ్‌లు తమ పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ఇప్పటికే రంగంలోకి దిగారు. మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో గట్టి దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీ సైతం పంచాయతీ ఎన్నికల్లో ఈసారి హోరాహోరీగా తలపడేందుకు సిద్ధమవుతోంది. ఖానాపూర్‌లో ఆ పార్టీ ఇంచార్జీ జాన్సన్ నాయక్, నిర్మల్‌లో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రాంకిషన్ రెడ్డి, ముథోల్‌లో కిరణ్ కొమురేవార్, విలాస్ గాదేవార్, రమాదేవీలతోపాటు పార్టీ మద్దతుదారులను గెలిపించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు.



కల్లూరులో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల జిల్లా పరిశీలకులు అయేషా నస్రత్ ఖానమ్ అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ ఆఖరు రోజు కావడంతో 5 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న అభ్యర్థుల నామినేషన్‌లను తప్పనిసరిగా స్వీకరించాలని ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచించారు.

నామినేషన్లు స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

భైంసారూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 30 గ్రామ పంచాయతీలు సర్పంచ్ నామినేషన్లు స్వీకరించడానికి అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో నీరజ్‌కుమార్ తెలిపారు. మండలంలో తొమ్మిది క్లస్టర్లుగా విభజించి పత్రాలు స్వీకరిస్తున్నామని, అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా పత్రాలు అసమర్పించాలని సూచించారు.



నామినేషన్ కేంద్రం వద్ద భైంసా రూరల్ సీఐ నైలు

ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

కుంటాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ నైలు అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని కల్లూరు, లింబా (కే) తదితర నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఆయనవెంట ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.



తిరుపతి టు అరుణాచలం బయలుదేరుతున్న బస్సు

అక్కాపూర్ నుంచి అరుణాచలం, తిరుపతి
సర్వీసు ప్రారంభం

నిర్మల్ రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): అక్కాపూర్ నుంచి అరుణాచలం, తిరుపతి ఆర్టీసీ సర్వీసు బుధవారం ప్రారంభించారు. మండలంలోని అక్కాపూర్ గ్రామం నుంచి 35 మంది ప్రయాణికులు అరుణాచలం, తిరుపతికి బస్సు బుక్ చేసుకోవడంతో నిర్మల్ డిపో బస్సు బయల్దేరినట్లు డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ గ్రామానికైనా 30 మందికి పైగా ప్రయాణికులు ఉంటే బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఈ బస్సు ఈనెల 2 నిర్మల్ నుంచి బయలుదేరి మరుసటి ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయకుడిని దర్శించుకొని అరుణాచలం వెళ్తుంది. అరుణాచలంలో దర్శనం గిరి ప్రదక్షిణ చేసుకొని 4న తిరుపతి చేరుకుంటుంది. 5వ తేదీ రోజు తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం బయలుదేరి 6వ తేదీ జోగులాంబను దర్శనం చేసుకొని నిర్మల్‌కు చేరుకుంటుందని వెల్లడించారు.

ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు నివాసంలో తేనేటి విందుకు ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూచాడి శ్రీహరిరావు, నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలపై శ్రీహరిరావుతో మంత్రి చర్చించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కూచాడి శ్రీహరిరావు

మాటేగాం టోల్‌ప్లాజా వద్ద రూ.50వేల పట్టివేత



ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి నగదును అప్పచెబుతున్న ఎస్ఐ

భైంసా, డిసెంబరు2 (ఆంధ్ర జ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.50వేల 200 నగదును బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భైంసారూరల్ ఎస్ఐ శంకర్ నేతృత్వంలోని పోలీసుశాఖ బృందం మాటేగాం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వానల్‌పాడ్ గ్రామం నుంచి భైంసాకు కారులో వస్తున్న గందం అనిల్ వాహనాన్ని పోలీసులు ఆపి పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.50,200 నగదు ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత నగదును రూరల్ ఎస్ఐ శంకర్ భైంసా మండల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అప్పగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అక్రమ రవాణా, అనధికార నగదు ప్రవాహ ఉల్లంఘనలను నిరోధించేందుకే తనిఖీలు చేపడుతున్నామని, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు తనిఖీలు కొనసాగుతాయని, ప్రజలు రూ.50వేలకు మించి నగదు తరలించొద్దని ఎస్ఐ శంకర్ వెల్లడించారు.



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న శ్రీలత

బాల్య వివాహాలను రూపుమాపేందుకు
అందరూ కృషి చేయాలి

- ఖానాపూర్ సీడీపీవో శ్రీలత
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన

ఖానాపూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ సీడీపీవో శ్రీలత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం బాల్యవివాహాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని వివరించారు. మైనర్లకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. ఎవరైనా మైనర్లకు వివాహం చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, సీడీపీవో సరిత, మిషన్ శక్తి అధికారి సవిత, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హిల్ట్ పాలసీలో రూ. లక్షా 29వేల కోట్ల
ల్యాండ్ లూటీ స్కామ్

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (హెచ్ఐఎల్‌టీ) పాలసీలో రూ.లక్షా 29వేల కోట్ల స్కామ్ జరిగిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నిర్మల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని 22 పారిశ్రామికవాడల్లో ఉన్న 9,292 ఎకరాల భూమిని మల్టీయూజ్ జోన్లుగా కన్వర్షన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం తెచ్చిన హిల్ట్ పాలసీ లోప భూయిష్టంగా, రూ.లక్ష 29వేల కోట్ల మేర ల్యాండ్ లూటీ స్కామ్‌కు తావిచ్చేలా ఉందని ఆరోపించారు. హిల్ట్ పాలసీలో ఉన్న లోపాలను నిరూపిస్తానని, లేదంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ మంత్రులకు సవాల్ కూడా విసిరారు. భారీస్థాయిలో అవినీతికి ఆస్కారమిచ్చేలా ఉన్న హిల్ట్ పాలసీని అమలు కాకుండా జోక్యం చేసుకోవాలంటూ బీజేపీ ప్రతినిధి బృందం గవర్నర్‌కు కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు హిల్ట్ పాలసీపై తాము లేవనెత్తిన చాలా అంశాలకు సమాధానాలు చెప్పకుండా దాటవేయడం బాధ్యతారాహిత్యమేనన్నారు. కేస్ టుకేస్ కన్వర్షన్ అంటే ఎన్ని పరిశ్రమలు తరలించే యోచన ఉన్నారు.. మరి తరలించని పరిశ్రమల పక్కనహౌసింగ్ కాలనీలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. పాలసీపై వివరణ ఇవ్వకుండా ఇలాంటి చిల్లర ఆరోపణలు చేయడం మంత్రి శ్రీధర్‌బాబు దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఈ పరిశ్రమలు 50 ఏళ్లుగా విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థాలు భూమిలో ఇంకిపోవడం వల్ల ఈ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతించినట్టయితే విషతుల్యమై భూగర్భ జలాల వల్ల అక్కడ నివసించనున్న ప్రజలకు అనారోగ్య సమస్యలు రావా అంటూ ప్రశ్నించారు.

చివరి విడత నామినేషన్ల స్వీకరణకు
రంగం సిద్ధం

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 133 గ్రామ పంచాయతీలు, 1,129 వార్డులు
- నామినేషన్ల స్వీకరణకు 35 క్లస్టర్ కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

భైంసా, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చివరివిడత ఎన్నికల నిర్వహించే ఐదు మండలాల పరిధిలోని 133 గ్రామపంచాయతీలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. బుధవారం నుంచి స్వీకరించే నామినేషన్లకు ఆయా మండలాల అధికార ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించేందుకు రాష్ట్రఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. తొలి, మలి విడత ఎన్నికలు నిర్వహించే పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ముగియడంతో అధికారులు మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులతోపాటు వార్డు సభ్యులుగా పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు గాను మండలాల వారిగా క్లస్టర్లను ఏర్పాటుచేశారు. చివరివిడతగా భైంసా డివిజన్ పరిధిలోని బాసర, భైంసా, ముథోల్, తానూర్, కుభీర్ మండలాల పరిధిలోని 133 గ్రామ పంచాయతీలు 1,129 వార్డు స్థానాలకు ఎన్నికల నామినేషన్లను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఆయా మండలాల అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణకు అవసరమైన పత్రాలను అందించేందుకు క్లస్టర్ల వారిగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం క్లస్టర్లలోని రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల స్వీకరణపై ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించి సామగ్రిని అందచేశారు. బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణప్రక్రియ మూడురోజుల పాటు కొనసాగనుంది. సంబంధిత ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయా మండలాల అధికార యంత్రాంగం ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టింది.

మండలాల వారిగా చివరి విడత ఎన్నికలు ఇలా..

మండలం	పంచాయతీలు	వార్డుల సంఖ్య
భైంసా	30	258
కుభీర్	42	344
తానూర్	32	268
ముథోల్	19	166
బాసర	10	90
మొత్తం	13	1,129

నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ఇలా..

- డిసెంబరు 3 నుంచి 5వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ (ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)
- 6న నామినేషన్ల పరిశీలన (సాయంత్రం 5 గంటల వరకు)
- 7 న నామినేషన్ల తిరస్కరణ అప్పీలుకు తుది గడువు (సా.5 గంటల వరకు)
- 8న అప్పీలు పరిష్కారానికి చివరి రోజు (సా.5 గంటలకు ముందు)
- 9న నామినేషన్ పత్రాల ఉపసంహరణకు చివరిరోజు (సా.3 గంటల లోపు)
- 9న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన (మధ్యాహ్నం 3 తర్వాత)
- 17న పోలింగ్ నిర్వహణ (ఉ.7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు)
- 17న మధ్యాహ్నం 2 తర్వాత నుంచి ఓట్ల లెక్కింపు.. అదేరోజు ఫలితాల వెల్లడి



బెల్‌తరోడా క్లస్టర్‌లో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లు చేపట్టిన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

నామినేషన్ల స్వీకరణకు 35 క్లస్టర్ కేంద్రాల ఏర్పాటు

డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కోసం గాను అధికారులు మొత్తం 35 క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భైంసా మండలంలో 9, కుభీర్ మండలంలో 10, బాసర మండలంలో 4, ముథోల్ మండలంలో 5, తానూర్ మండలంలో 7 క్లస్టర్ కేంద్రాలున్నాయి. ఒక్కో క్లస్టర్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల పత్రాలను స్వీకరించనున్నారు. భైంసా డీఎల్‌పీవో పి. లక్ష్మణ్ బుధవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఆయా క్లస్టర్ కేంద్రాలలోని ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియపై రిటర్నింగ్ ,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు,సలహాలు అందించారు.



తిమ్మాపూర్ క్లస్టర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎల్‌పీఏ పి.లక్ష్మణ్